సాక్షి సంగారెడ్డి
గురువారం । 26 । జూన్ । 2025



'మురికి'పాలిటీలు

ఉమ్మడి జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

వివరాలు 8లో ▸



డ్రగ్స్‌తో జీవితాలు చిత్తు

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని సీపీ అనురాధ పేర్కొన్నారు.

వివరాలు 8లో ▸



హాస్టళ్లలో సమస్యల తిష్ట

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

వివరాలు 9లో ▸

పంచాయతీ పోరు

మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- ఇప్పటికే సిద్ధమైన ఓటర్ల జాబితా, బ్యాలెట్ బాక్సులు
- రిజర్వేషన్లు తేలకపోవడంతో నిలిచిన ఎన్నికల ప్రక్రియ
- కోర్టు తాజా ఆదేశాలతో వేడెక్కనున్న పల్లె రాజకీయం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పల్లె రాజకీయ మళ్లీ వేడెక్కనుంది. మూడు నెలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల సందడి షురూ కానుంది. సర్పంచులుగా, వార్డు సభ్యులుగా పోటీ చేయాలని భావిస్తున్న నాయకులు మళ్లీ మద్దతు కోసం మంతనాలు ప్రారంభించనున్నారు. రిజర్వేషన్లపై స్పష్టత వచ్చాకే ఆశావహులు ప్రత్యక్ష కార్యచరణకు దిగాలని యోచిస్తున్నారు. ఈ రిజర్వేషన్ తమ అనుకూలంగా వస్తే..అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటినుంచి మద్దతు కోసం కార్యాచరణ ప్రారంభిస్తే ఖర్చులు తడిసి మోపెడవుతాయని..తీరా రిజర్వేషన్ అనుకూలంగా రాకపోతే ఖర్చులన్నీ వృథా అవుతాయనే ఆలోచనలో చోటా మోటా నాయకులు ఉన్నారు. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం 2024 జనవరి 31తోనే ముగిసిన విషయం విదితమే. అప్పట్నుంచి గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు కూడా ఆగిపోవడంతో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ్యనేతలకు ప్రతిష్ఠాత్మకమే..

గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీలకతీతంగా జరుగుతాయి. అయినప్పటికీ ఆయా నియోజకవర్గాల నేతలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. తమ అనుచరులనే సర్పంచులుగా గెలిపించుకుంటేనే ఆయా గ్రామాల్లో నియోజకవర్గస్థాయి నాయకులకు పట్టు ఉంటుంది. దీంతో అన్ని పార్టీల నాయకులు తమకు అనుకూలమైన వ్యక్తులను బరిలోకి దింపేందుకు ఇప్పట్నుంచి అన్వేషణ ప్రారంభించనున్నారు.

ఇప్పటికే సగం ఏర్పాట్లు పూర్తి

ఈ ఎన్నికలను ఆరు నెలల క్రితమే నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం జనవరిలో చకచకా ఎన్నికల ఏర్పాట్లు చేసింది. ఓటరు జాబితాలను కూడా సిద్ధం చేసింది. ఈవీఎంలు కాకుండా, బ్యాలెట్ విధానంలో ఈ పోలింగ్ ప్రక్రియను నిర్వహించాల్సి ఉండటంతో ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాష్ట్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను జిల్లాకు తెప్పించారు. అలాగే బ్యాలెట్ పేపర్లు కూడా ముద్రించారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కూడా గుర్తించారు. స్టేజ్-1, స్టేజ్-2 ఇలా వివిధ స్థాయిల్లో పోలింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అవసరమైన ఆయా స్థాయిల్లోని అధికారులను, సిబ్బంది జాబితాను రూపొందించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన దాదాపు అన్ని ప్రక్రియలు ఇప్పటికే పూర్తి చేసిన అధికారులు తీరా రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో పోలింగ్ ప్రక్రియ జరగలేదు. ఇప్పుడు హైకోర్టు తీర్పు నేపథ్యంలో అధికార యంత్రాంగం మళ్లీ ఈ ఎన్నికల ఏర్పాట్లపై నిమగ్నం కానుంది.

ఉమ్మడి జిల్లాల వారిగా

జిల్లా	గ్రామపంచాయతీలు
సంగారెడ్డి	631
మెదక్	492
సిద్దిపేట	499

న్యూస్‌రీల్

సీఎంని కలిసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మురళీకృష్ణ

పటాన్‌చెరు: ఇటీవల టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పటాన్‌చెరుకు చెందిన బాలమురళీకృష్ణ (చిన్న ముదిరాజ్) బుధవారం గాంధీ భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీలో తనకు చోటు కల్పించినందుకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి చేరేందుకు తనవంతు కృషి చేస్తానని మురళీకృష్ణ చెప్పారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



సబిత పాఠశాలను సందర్శించిన సౌజన్య

సంగారెడ్డి టౌన్: పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని సబిత ప్రతిభావంతుల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10 పుణ్యక్షేత్రాలకు రేపు ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్: రాష్ట్రంలోని 10 పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వచ్చేలా ఖేడ్ నుంచి ఈనెల 27న గురువారం ప్రత్యేకంగా ఒక సూపర్‌లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. బస్సులు ఉదయం 8గంటలకు ఖేడ్ నుంచి బయల్దేరి 36 గంటల పాటు ప్రయాణించి 10 పుణ్యక్షేత్రాలైన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామగుండం, మిడ్‌మానేరుడ్యాం, వరంగల్, సిద్దిపేట, మెదక్, ఏడుపాయలను దర్శించుకుని 28న సాయంత్రం తిరిగి ఖేడ్‌కు చేరుకుంటాయని తెలిపారు. ఒక్కొక్కరికి ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.1,400, డీలక్స్‌బస్‌కు రూ.1,600 చార్జీ ఉంటుందన్నారు. కొన్ని సీట్లు మాత్రమే మిగిలి ఉన్నందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలు, టికెట్ బుకింగ్ కోసం 9959223170, 9441071134, 9676667703 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగిన జిల్లా కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వెంటనే లేబర్ కోడ్‌లు రద్దు చేయడంతో పాటు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా మాణిక్యం, కార్యదర్శిగా సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ పటిష్టంతోనే సమస్యలు పరిష్కారం



సమీక్షలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య. చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సంగారెడ్డి/జోగిపేట(అందోల్)/పాపన్నపేట(మెదక్): విద్యా వ్యవస్థ పటిష్టమైతేనే దేశంలో ఏ సమస్యకైనా సరైన పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కళాశాలను, అందోలులోని గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. అంతకుముందు మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గమ్మను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో ఇప్పటివరకు 26 గురుకుల పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదికను అందజేశామన్నారు. తెలంగాణలో ఆకలినైనా భరిస్తారు కానీ, ఆత్మగౌరవాన్ని దెబ్బతింటే భరించలేరన్నారు. గురుకుల పాఠశాలలో బోధన, భోజనం ఎలా ఉందని అక్కడి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సత్కరించారు. వెంకటయ్య వెంట ఆర్డీఓ పాండు, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డిలతోపాటు కళాశాల, గురుకుల పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకూడదు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలను జూలై 30వ తేదీ నాటికి పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ...ప్రతీ నెల అన్ని మండలాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసమే వినియోగించాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. సమీక్షలో ఎస్పీ పరితోశ్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

27న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్య నిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులో భాగంగా ఈ నెల 27న నిధి ఆప్ కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొల్లారం పారిశ్రామికవాడలోని మైలాన్ లేబోరేటరీస్ లిమిటెడ్, సంగారెడ్డి పసల్‌వాడ ఎంఎన్‌ఆర్ వైద్య కళాశాల, హైదరాబాద్ హైటెక్ సిటీ రోడ్డు అరబిందో, పటాన్‌చెరు పారిశ్రామికవాడ సింగర్ పల్లి రోడ్డు ప్యారగాన్ పాలిమర్ ప్రైవేట్ లిమిటెడ్‌లలో పీఎఫ్ సమస్యలు ఉన్న వారు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

స్వేచ్ఛా వాతావరణంలోనే బోధన

ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు



బాల మేళా కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, చిన్నారులు తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): చిన్నారులను మూడేళ్ల వయసు నుంచే కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు పంపించడం వల్ల ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని, విద్యా బోధన ఎప్పుడూ స్వేచ్ఛాయుత వాతావరణంలోనే జరగాలని ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పేర్కొన్నారు. మండల పరిధిలోని తొగర్‌పల్లిలో అంగన్‌వాడీ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన బాల మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నేర్పించే ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతి రోజూ అంగన్‌వాడీ పిల్లలకు అందించే పూర్వ ప్రాథమిక విద్య ఏ విధంగా ఉంటుందో ప్రదర్శన ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దశరథ్, సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్‌లు విమల, శైలజ, టీచర్‌లు స్వప్న, సుశీల, లలిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షుడు అశోక్ కుమార్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షుడు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ..ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించే విధానాన్ని పునరాలోచించి డీఈఓ, డిప్యూటీ డీఈఓ, మండల విద్యాధికారులను నియమించాలన్నారు. డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో 10%, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20% నిధులు విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పామ్‌తో వందశాతం భరోసా

ఉద్యానశాఖ జిల్లా డీడీ సోమేశ్వర్‌రావు



మొక్కలు నాటుతున్న సోమేశ్వర్‌రావు

జహీరాబాద్ టౌన్: ఆయిల్‌పామ్ సాగు రైతులకు ప్రభుత్వం వందశాతం భరోసా కల్పిస్తుందని ఉద్యానశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సోమేశ్వర్ రావు అన్నారు. మండలం పరిధి గోవింద్‌పూర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఉద్యానశాఖ, గోద్రేజ్ ఆగ్రోవిట్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించి 250 ఎకరాల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, పంట భవిష్యత్‌లో లబ్ధి చేకూరుస్తుందని చెప్పారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి 3,750 ఎకరాల లక్ష్యంగా నిర్దేశించుకుని 2500 ఎకరాల రైతుల పేర్లను నమోదు చేసుకున్నామని చెప్పారు. ఇప్పటికే 1024 ఎకరాలకు పరిపాలన మంజూరు ఇచ్చామన్నారు. ఆయిల్‌పామ్ సాగు కోసం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు ఇస్తామని తెలిపారు. జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం మండలాల్లోని రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, జిల్లాలోని మిగతా ప్రాంత రైతులు ముందుకురావాలని చెప్పారు. ఆయిల్‌పామ్ గెలలను గోద్రెజ్ కంపెనీ కొంటారని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని పంటలను సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి పండరి, సేరికల్చర్ అధికారి శ్రీనివాస్, గోద్రేజ్ కంపెనీ జిల్లా ఇన్‌చార్జి కొండల్‌రావు, ప్రతినిధి వెంకటేశ్వర్లు, అధికారులు మహేందర్‌సింగ్, మహేశ్, నవదీప్, పాండు, రైతులు పాల్గొన్నారు.

పీఆర్ శాఖలోనే కార్యదర్శులు

- రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు
- కోర్టును ఆశ్రయించిన పలువురు పంచాయతీ కార్యదర్శులు
- త్వరలో మరిన్ని పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం



సంగారెడ్డి జోన్: జిల్లాలో మున్సిపాలిటీలలో విలీనమైన పంచాయతీల కార్యదర్శులు పంచాయతీ రాజ్ శాఖలోనే కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేయడంతోపాటుగా పలు గ్రామాలను కలుపుతూ నూతన మున్సిపాలిటీలను కూడా ఏర్పాటు చేసింది. పంచాయతీలను విలీనం చేసినప్పటికీ సంబంధిత పంచాయతీ కార్యదర్శులు మాత్రం ఇప్పటివరకు మున్సిపల్ పరిధిలోనే విధులు నిర్వహించారు.

మున్సిపల్‌కే ఆసక్తి చూపి..

మున్సిపల్‌లో విలీనం అయిన సంబంధిత కార్యదర్శులు ఆ శాఖలోనే విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపించారు. కొన్ని నెలల క్రితం విలీనం అయిన గ్రామ అధికారుల నుంచి పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వహిస్తారా? మున్సిపల్ శాఖలో విధులు నిర్వహిస్తారా? అనే అంశంపై సంబంధిత కార్యదర్శుల నుంచి మున్సిపల్ అధికారులు ఆప్షన్లు తీసుకున్నారు. మున్సిపల్‌లో త్వరితగతిన పదోన్నతులు లభించటంతో పాటు అర్బన్ ఏరియాలో పని చేసే అవకాశం ఉంటుందనే కారణాలతో ఎక్కువగా మున్సిపల్‌లోనే విధులు నిర్వహించేందుకు ఆప్షన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది.

కోర్టును ఆశ్రయించి..

మున్సిపాలిటీలలోనే తాము విధులు కొనసాగిస్తామంటూ పలువురు పంచాయతీ కార్యదర్శులు కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. పలు గ్రామాలు మున్సిపాలిటీలలో విలీనం అయిన తర్వాత ఇప్పటివరకు మున్సిపల్‌లోనే విధులు నిర్వహించారు. అయితే తిరిగి పంచాయతీరాజ్ శాఖకు రావాలని ఉత్తర్వులు రావడంతో కోర్టుకు వెళ్లారు. మిగతా వారికి త్వరలో పంచాయతీ కార్యదర్శులుగా కేటాయించనున్నారు. ఇక జిల్లాలోని జిన్నారంతోపాటు పటాన్ చెరువు మండలంలోని పలు గ్రామాలను కూడా త్వరలో మున్సిపాలిటీలలో విలీనం అవుతున్నట్లు సమాచారం.

పక్కా భవనాల్లో పంచాయతీలు

ఉపాధి హామీ పథకం ద్వారా తాత్కాలిక పనులు కాకుండా శాశ్వత పనులు చేపడుతూ పలు సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా పక్కా భవనాలను నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు గాను కూలీలకు పనికల్పిస్తూ డబ్బులు చెల్లించడంతోపాటు మెటిరీయల్ కాంపోనెంట్ ద్వారా భవనాల నిర్మాణాలను చేపట్టనున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

– నారాయణఖేడ్

- మండలానికి రెండేసి చొప్పున నిర్మాణం
- జిల్లాకు 27 జీపీలు, 62 అంగన్‌వాడీలు మంజూరు
- మరో 27 జీపీలకు గుర్తించనున్న స్థలాలు
- నెలాఖరులోగా స్థలాల ఎంపిక.. పనులు ప్రారంభం
- వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి భవనాలు

గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు సంబంధించి రెండు నెలల క్రితమే అధికారులు ప్రతిపాదనలు పంపించగా పలు భవనాలకు నిధుల మంజూరు లభించింది. కాగా ప్రతీ మండలంలో రెండేసి చొప్పున గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు తాజాగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. పనులకు సంబంధించి ఏయే మండలాల్లో నిర్మిస్తున్నా రో అందుకు సంబంధించి స్థలసేకరణ చేపట్టి నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని సంకల్పించింది. రూ.20లక్షల వ్యయంతో ఒక్కో పంచాయతీ భవనం నిర్మించనుండగా, ఒక్కో అంగన్‌వాడీ భవనానికి ఉపాధి నిధులు రూ.8లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2లక్షలు, మహిళా, శిశు సంక్షేమం నుంచి రూ.2లక్షలు కలిపి రూ.12లక్షలతో వెచ్చించనున్నారు. ఈ భవనాల నిర్మాణాలకు సంబంధించి నెలాఖరులో శంఖుస్థాపనలు చేసి మార్చి నాటికి పూర్తి చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

స్థలాల గుర్తింపులో జాప్యం కారణంగా

జిల్లాలో 27 మండలాలకు గాను 54 చొప్పున అంగన్‌వాడీలు, మరో 54 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాల్సి ఉంది. భవన నిర్మాణాల కోసం గత నవంబర్‌లోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యం నిర్దేశించుకోగా స్థలాల గుర్తింపు, అప్పగింతలో జాప్యం కారణంగా అనుకున్నస్థాయిలో భవనాల నిర్మాణాలు జరగలేదు. ఆ అనుభవాల దృష్ట్యా మండలానికి రెండు చొప్పున జీపీలు, అంగన్‌వాడీలను నిర్ణయించి స్థలాల ఎంపికను వేగంగా పూర్తి చేయాలనుకుంటోంది.



చెట్లకింద పాలన

జిల్లాలో 631 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో పక్కా భవనాలు 412 గ్రామ పంచాయతీలకు మాత్రమే. 219 పంచాయతీలకు భవనాలు లేవు. పాఠశాలలు, చావిడీలు, కమ్యూనిటీ భవనాలు, చెట్లకింద పాలన సాగుతోంది. జిల్లాలో కొత్తగా 11 పంచాయతీలు ఏర్పాటు కాగా అవి కూడా చెట్లకింద పాలనగానే ఉన్నాయి. మండలానికి రెండు చొప్పున 54 భవనాలు నిర్మాణం జరిగితే కొంత వెసులుబాటు కానుంది. జిల్లాలో ఐదు అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో సొంత భవనాలు 509 అంగన్‌వాడీలకు మాత్రమే ఉన్నాయి. 528 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఉచిత భవనాల్లో 466 ఉన్నాయి.

యూనిక్ మోడల్‌గా భవనాలు

నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు యూనిక్ మోడల్‌గా ఉండాలని ఆశాఖ మంత్రి సీతక్క ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ భవనాలను ప్రజలు చూడగానే అవి గ్రామ పంచాయతీ భవనాలు అని, ఇవి అంగన్‌వాడీ భవనాలుగా గుర్తించేలా ఉండేలా డిజైన్ రూపొందించాలని సూచించారు.

భవనాల నిర్మాణాలకు చర్యలు



"ప్రభుత్వం ప్రతీ మండలానికి రెండు చొప్పున గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలని ఆదేశించింది. ఉపాధి కూలీల ద్వారా పనులు కల్పిస్తూ మెటీరియల్ కాంపోనెంట్ మంజూరు చేస్తూ నిర్మాణాలు చేపడతాం.

– బాల్‌రాజ్, అదనపు పీడీ, డీఆర్‌డీఏ, సంగారెడ్డి"

క్లుప్తంగా

కొమురవెల్లిలో దొంగతనం

బంగారం, వెండి, రూ. 50 వేలు అపహరణ


విచారణ చేస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఏఎస్ఐ సత్యనారాయణ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పోతుగంటి కొమురెల్లికి రెండు ఇళ్లు ఉన్నాయి. అతను పాత ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి వెనుకాల ఉన్న గేట్‌లో నుంచి దూకి కొత్త ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. తాళాలతో బీరువాను తెరిచి సుమారు ఐదు తులాల బంగారు, 22 తులాల వెండి అభరణాలు, రూ.50వేలు అపహరించారు. దీంతో బాధితుడు పోలీసలకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు.

లద్నూరులో చోరీకి యత్నం

మద్దూరు(హుస్నాబాద్): దొంగలు చోరీకి యత్నించి గ్రామంలో తచ్చాడుతూ పట్టుబడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన గడ్డం పద్మ బుధవారం ఉదయం 8 గంటలకు ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. తిరిగి 10గంటలకు కుమారుడితో కలిసి వచ్చి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగలు పడ్డారని గ్రహించి వెతకగా.. గ్రామ శివారులోని దుర్గమ్మ ఆలయం వద్ద ఏడుగురు మహిళలు, ఒక యువకుడు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని వెంబడించి ప్రశ్నించగా ముగ్గురు పరారయ్యారు. మిగిలిన ఐదుగురిని గ్రామస్తులతో కలిసి పోలీసులకు అప్పగించారు. వరంగల్ జిల్లాకు చెందిన వారుగా గుర్తించి, పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాగా ఇప్పటికే వీరిపై పలు పోలీస్ స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు.

పార్కు చేసిన ఆటో చోరీ

నర్సాపూర్: ఇంటి ముందు పార్కు చేసిన ఆటో మంగళవారం రాత్రి నర్సాపూర్‌లో చోరీకి గురైంది. ఆటో యజమాని అశోక్ వివరాల ప్రకారం.. ఆటో అవసరం ఉందని తన మిత్రుడు సమీర్ అడగడంతో అతనికి ఇచ్చాడు. సమీర్ తన పనులు పూర్తి చేసుకుని రాత్రి నర్సాపూర్‌లోని షాదీఖానా ఏరియాలోని తన ఇంటి ముందు పార్కు చేశాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆటోను దొంగిలించాడు. చోరీ జరిగిన తర్వాత తూప్రాన్ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. చోరీ విషయమై ఫిర్యాదు చేసేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా తూప్రాన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించాల్సి ఉంటుందని చెప్పగా తాను అక్కడికి వెళ్లి ఆటో వివరాలు అందచేశానని అశోక్ తెలిపారు. ఫిర్యాదు తర్వాత తీసుకుంటామని పోలీసులు చెప్పారని బాధితుడు పేర్కొన్నాడు.

ఇప్పలకుంట సమీపంలో కాలిన మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): గుర్తు తెలియని కాలిన మృతదేహం కనిపించింది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని కాసాల గ్రామ శివారులో ఇప్పలకుంట సమీపంలో సుమారు 25 నుంచి 30 సంవత్సరాల గల వ్యక్తి కాల్చివేసి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి ఒంటిపై గ్రే కలర్ జీన్ పాయింట్ వేసుకొని ఉన్నాడు. కుడిచేతికి వెండి కడియం ఉంది. వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

అక్రమ ఇసుక వాహనం పట్టివేత


అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లి గ్రామ శివారులో గల మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ సిబ్బంది కొమురయ్య పట్టుకున్నారు. వివరాలు ఇలా... వింజపల్లి గ్రామం నుంచి చిన్నకోడూరు మండలానికి అక్రమంగా ఇసుకను తీసుకువెళ్తున్నారని సమాచారం వచ్చింది. దీంతో గ్రామంలోకి వెళ్లి చూడగా ఎలాంటి అనుమతులు లేకుండా బొలెరో వాహనంలో ఇసుకను తరలిస్తున్నారు. వాహనాన్ని పట్టుకొని తహసీల్దార్ అహ్మద్‌కు అప్పగించారు.

మురికిపాలిటీలు!

ఉమ్మడి జిల్లాలో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జూన్ 2నుంచి ప్రారంభించిన 100 రోజుల ప్రణాళిక తూతూ మంత్రంగా కొనసాగుతోంది. చెత్త సేకరణ, పారిశుద్ధ్యంపై అవగాహన కరువైంది. అధికారులు నామమాత్రంగా కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకోవడంతో చెత్త పేరుకుపోయింది. ఆయా మున్సిపాలిటీల పరిధిలో మురుగు నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి.

మొక్కుబడిగా వంద రోజుల ప్రణాళిక

- పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వ్యాధులు ప్రబలే ప్రమాదం


ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

అమలు కాని ప్రణాళిక

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక సక్రమంగా అమలు కావడం లేదు. గజ్వేల్‌తోపాటు ప్రజ్ఞాపూర్, సంగుపల్లి, రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, ముట్రాజ్‌పల్లి, క్యాసారం గ్రామాలు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కూడా భౌగోళికంగా మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ఇక్కడ వంద రోజుల ప్రణాళిక మచ్చుకైనా కనిపించడం లేదు. అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. మున్సిపాలిటీలో నిత్యం 20 టన్నులకుపైనే చెత్త ఉత్పత్తి అవుతున్నది. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక.. రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో చెత్త దర్శనమిస్తోంది. ఈ పరిస్థితి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది.

ఎక్కడ చూసినా మురికి కూపం

సంగారెడ్డి: మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వార్డులకు సరిపడా వాహనాలను సిబ్బందికి అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. పనులన్నీ ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో కొనసాగుతుండటంతో అర్థం గాని పరిస్థితి నెలకొంది. దీంతో పట్టణంలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే దర్శనమిస్తూ చెత్తకుప్పలను కాలుస్తున్నారు. తీవ్ర కాలుష్యం ఏర్పడుతుందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


జీన్స్ కార్నర్ వెంట ఉన్న నాలాలో ప్లాస్టిక్ వ్యర్థాలు

అరకొర పనులే..


పటాన్‌చెరు: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలంలో పొంగి పొర్లుతున్నాయి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రధాన లైన్లలో సిల్టును తొలగించారు. ప్రజలకు తడి,పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్స్ జారీ ఇతర ప్రధాన అంశాలను నిర్వహించలేకపోతున్నారు. పట్టణ విస్తీర్ణం ఎక్కువగా ఉండటం, సిబ్బంది కొరతతో సమస్యలు సమర్థవంతంగా పరిష్కరించ లేకపోతున్నారు.


చెత్త తరలించే వాహనంలో చెత్తను నింపి ఇలా..

దుర్వాసన భరించలేకపోతున్నం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 11వ వార్డు బీరప్ప బస్తీలో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. అధికారులు మాత్రం ప్రణాళిక హట్టహాసంగా సాగుతున్నట్లు ప్రచారం చేస్తున్నారని అసహనానికి గురవుతున్నారు. సేకరించిన చెత్తను నివాసాల మధ్య వాహనాల్లో నింపి వదిలేయడంతో దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. రాబోయే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు శుభ్రత పనులు చేపట్టాలని కోరుతున్నారు.


జహీరాబాద్ టౌన్: పెద్ద కాలువలోని చెత్తను తొలగిస్తున్న జేసీబీ


సిద్దిపేటజోన్: పొంగిపొర్లుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

అమలు అంతంత మాత్రమే!

జహీరాబాద్ టౌన్: మున్సిపాలిటీలో ప్రణాళిక పూర్తిగా పట్టాలెక్కలేదు. పట్టణంలోని గడి ప్రాంతం నుంచి వెళ్తున్న పెద్ద వాగు కాలువల్లోని చెత్తను జేసీబీలతో తొలగిస్తున్నారు. ముఖ్యంగా పిచ్చి మొక్కల తొలగింపు, పారిశుధ్యం, ట్యాంకుల శుభ్రతపై శ్రద్ధ వహిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్‌ను విస్మరించారు. మెప్మా ఉద్యోగులు నూతన పొదుపు సంఘాలు ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలు, మొక్కలు నాటడం ప్రారంభం కాలేదు. పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు.

మురుగు పరుగు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వర్షాకాలం కావడంతో మురుగుకాల్వల పర్యవేక్షణ లోపభూయిష్టంగా మారింది. కొద్దిపాటి వర్షానికి వరద నీరు రోడ్లపైకి రావడంతో జలమయమవుతున్నాయి. దోమలతో పాటు కుక్కల బెడద అధికంగా ఉంది. అధికారులు యానిమల్ బర్త్ కంట్రోల్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వీధి విక్రయ జోన్ పటిష్టంగా అమలు కావడం లేదు. వెరసి సమస్యలతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సదాశివపేటలో అధ్వానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పట్టణంలోని 26 వార్డులలో రోడ్ల ప్రక్కన చెత్తాచెదారం దర్శనమిస్తోంది. సిద్దాపూర్ ప్రధాన రోడ్డు ప్రక్కన కుళ్లిన కూరగాయలు, మాంసపు వ్యర్థాలు పడేయడంతో దుర్గంధంతో ప్రజలు, వాహనదారులు ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలోని మురుగు నీరు కాలువల ద్వారా ఊబ చెరువులో కలుస్తుండటంతో చెరువు కలుషితమవుతోంది. పట్టణంలోని ప్రధాన డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.


డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జనావాసాల్లో మురుగు కుంటలు

హుస్నాబాద్: పట్టణంలో పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. తడి, పొడి, హానికమైన చెత్తపై ప్రజలకు అవగాహన, వాటర్ ట్యాంక్‌ల వద్ద తాగునీటి క్లోరినేషన్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. కొన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. కుంటలను తలపించేలా ఇండ్ల మధ్య మురికి నీరు నిలువడంతో దోమలకు నిలయంగా మారింది. మురుగునీరు బయటకు వెళ్లే మార్గం చేయకపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. టీచర్స్ కాలనీలో డ్రైనేజీ లేక మురుగు, చెత్త ఒకే చోట నిలిచి పందులకు ఆవాసాలుగా మారుతోంది.


పట్టణంలోని సీపీఐ భవన్ సమీపంలో ఇళ్ల మధ్య మురుగు గుంత

ఎక్కడి సమస్యలు అక్కడే

తూప్రాన్: మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళిక నామమాత్రంగా కొనసాగుతుంది. మురికి కాలువల శుభ్రం, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు, తడి, పొడి చెత్త పనులపై అధికారులు అవగాహన కల్పించి చేతులు దులుపుకుంటున్నారు. పట్టణంలోని16 వార్డుల్లో అధికంగా 5, 6, 12, వార్డుల్లో సమస్యలు ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి గుంతలమయంగా రోడ్లు, బురదమయంగా నడవరాని పరిస్థితి నెలకొంది. ఈ కాలనీల్లో గతంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం నిర్మించిన మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి


పట్టణంలోని ఆరవ వార్డులో బురదమయంగా రోడ్డు దుస్థితి

డ్రగ్స్‌తో జీవితాలు చిత్తు


పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ తదితరులు

సీపీ అనురాధ

- ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

సిద్దిపేటకమాన్: డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని సీపీ అనురాధ పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించారు. యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది వారం రోజులుగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం పలువురు అధికారులు పాల్గొని మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడి విద్యార్థులు సమస్యలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవేర్‌నెస్‌పై పెయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి త్వరలో ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులతో జిల్లా కేంద్రంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డ్రగ్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు, సిబ్బంది వినియోగించే ఆయుధాలు, ఇతర పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్ర బోస్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, సుమన్‌కుమార్, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, శ్రీధర్‌గౌడ్, దుర్గ, ఎస్ఐలు అపూర్వరెడ్డి, రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఆయుధాల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

- చెదరగొట్టిన పోలీసులు
- పూరిగుడిసెను దహనం చేశారని ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): భూ వివాదం ముదిరి అనుమానాస్పదంగా పూరిగుడిసె దగ్ధమైన ఘటనలో ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డాయి. ఈ ఘటనపై మండలంలోని సంగాయిపల్లిలో మంగళవారం అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల పోచయ్య అదే గ్రామానికి చెందిన చల్ల సాయిలు వద్ద 4 గుంటల పొలం 2013లో కొనుగోలు చేశాడు. ఈ భూమిలో గుడిసె వేసి తన కూతురు నర్సమ్మను ఉంచాడు. ఈ భూమి విషయంలో సాయిలు కుమారులు చల్ల రాజు, నవీన్ నర్సమ్మతో మంగళవారం మధ్యాహ్నం గొడవపడ్డారు. దీంతో నర్సమ్మ తనతల్లిగారి ఇంటికి వెళ్లింది. ఇదే సమయంలో బుధవారం తెల్లవారుజామున నర్సమ్మ పూరిగుడిసె అనుమానాస్పదంగా దగ్ధమైంది. కాగా తన కూతరు గుడిసెను చల్ల రాజు, నవీన్ తగలబెట్టడంతో పాటు దాడిచేశారని పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు.


కాలిపోయిన పూరిగుడిసె

ప్రజాస్వామ్య హక్కులకు పోరాటం చేద్దాం

సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

పటాన్‌చెరు టౌన్: ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులను రక్షించుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య ప్రజానీకం, కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పక్కదారి పట్టించడం కోసం ఇందిరా గాంధీ ఆనాడు ఎమర్జెన్సీ విధించిందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం, జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను ప్రజలు, కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజు, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, హీజిద్ అలీ, పాండు రంగారెడ్డి, రాజు, ప్రసాద్, సత్తిబాబు, రామచంద్ర మూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

డబ్బులు రికవరీ

శివ్వంపేట(నర్సాపూర్): బ్యాంక్ ఖాతా నుంచి కాజేసిన డబ్బులు రికవరీ అయ్యాయి. మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బక్కయ్యకు గోమారం గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. కాగా తనకు తెలియకుండా రూ.60 వేలు డబ్బులు డ్రా అయిన విషయం పాఠకులకు తెలిసిందే. బుధవారం బ్యాంక్ మేనేజర్ ఖాతాదారుడికి సంబంధించి వివరాలు పరిశీలించగా బ్యాంకులో పనిచేసే బ్యాంక్‌మిత్ర రెండు దఫాలుగా రూ.30వేల చొప్పున డ్రా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో సదరు వ్యక్తి నుంచి డబ్బులు రికవరీ చేసి ఖాతాదారుడికి అందజేశారు. అతడి నిర్వాహకంపై ఏజెన్సీకి సమాచారం ఇచ్చామని బ్యాంకు మేనేజర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో 26మందికి కోర్టు జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 26 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు బ్రీత్ ఎనలైజర్ ద్వారా గుర్తించారు. బుధవారం వారిని గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరు పర్చగా 26 మందికి రూ.39వేల జరిమానా విధించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.


దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కేతకీలో అమావాస్య పూజలు

తరలివచ్చిన భక్తజనం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు చేసి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రాతః కాల పూజ నిర్వహించి భక్తులకు దర్శనం ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక పూజలు

భక్తులు స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, హారతి, కేశఖండనంతోపాటు తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలోని బలభీముని ఆలయం, నాగులకట్ట, పోగడ చెట్టు, నవగ్రహాలతోపాటు తదితర ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


పూజలు అందుకుంటున్న పార్వతీ పరమేశ్వరులు

వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం ... ఆదిలాబాద్ జిల్లా అనుకుంటకు చెందిన మైనాబాయి(62) మూడు రోజుల క్రితం ఫొటో ఫ్రేమ్‌లు అమ్ముకునేందుకు మెదక్ పట్టణానికి వచ్చింది. ఔరంగాబాద్ శివారులోని కలెక్టరేట్ కార్యాలయం ముందు గల గేటు వద్ద మెదక్ వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి..

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... కొండాపూర్ గ్రామానికి చెందిన కుక్కదువ్వు మల్లేష్(54), పెంజర్ల యాదయ్య తమ టీవీఎస్ మోపెడ్‌పై పని నిమిత్తం మండల కేంద్రానికి వెళుతున్నారు. అదే సమయంలో నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ గరుడ బస్సు హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తోంది. ఈ క్రమంలో జాతీయ రహదారి–44పై జీడిపల్లి శివారులోకి రాగానే బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంగా నడుపుతూ ముందు వెళుతున్న మోపెడ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెనకాల కూర్చున్న మల్లేష్‌కు తీవ్రగాయాలవ్వగా, యాదయ్యకు కుడిచెయ్యి విరిగింది. స్థానికులు తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మల్లేష్ అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మల్లేష్